# ప్రారంభమైన నామినేషన్ల ఘట్టం


కార్వాన్ రిటర్నింగ్ కార్యాలయంగా గోల్కొండ తహసీల్దార్ ఆఫీస్



మాట్లాడుతున్న నాంపల్లి నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి లావణ్య

## కార్వాన్, నాంపల్లి, చార్మినార్ నియోజకవర్గాల్లో మొదటిరోజు నిల్

కార్వాన్, నవంబర్ 3 : ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎమ్మెల్యే అభ్యర్థులు తమతమ నామినేషన్ల దరఖాస్తులు సమర్పించేందుకు ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ కార్యాలయాల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు. కార్వాన్ నియోజకవర్గంలో మొదటి రోజు ఒక్క నామినేషన్ దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారి డి. కొమరయ్య తెలిపారు.. లంగర్‌హౌస్‌లోని గోల్కొండ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించేందుకు ఏర్పాటు చేశామని , ఇప్పటివరకు 5 నామినేషన్ దరఖాస్తులు అభ్యర్థులు తీసుకెళ్లారని తెలిపారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు ఓబీసీలు రూ. 10 వేల డిపాజిట్ చేయాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ర. 5 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు.

### నిబంధనలు పాటించాలి : కొమరయ్య, ఆర్‌ఓ

- అసెంబ్లీ అభ్యర్థిత్వం కోసం పోటీ పడుతున్న వారు నాలుగు సెట్ల నామినేషన్లు సమర్పించవచ్చు.
- ఒక్కో అభ్యర్థి వెంట నలుగురికి మాత్రమే అనుమతి. అంటే అభ్యర్థితో కలిపి 5 మంది రిటర్నింగ్ అధికారి వద్దకు వెళ్లేందుకు అనుమతి.




- నామినేషన్ కోసం అభ్యర్థికి చెందిన 3 కార్లకు మాత్రమే అనుమతి
- రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో వాహనాలు నిలపాలి
- నామినేషన్ దాఖలు చేసే ప్రతి అభ్యర్థి ఆస్తులు, అప్పుల వివరాలతో పాటు వారి పై నమోదై ఉన్న కేసులను కూడా నామినేషన్ దరఖాస్తులో తెలపాలి.

మెహిదీపట్నం, నవంబర్ 3 : అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పర్వం శుక్రవారం ప్రారంభం అయ్యింది. నాంపల్లి నియోజకవర్గంనకు చెందిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో మొదటి రోజు నామినేషన్లు ఒక్కటి కూడా దాఖలు కాలేదు. నామినేషన్లను వేయడానికి వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు 16 వరకు దరఖాస్తులు తీసుకువెళ్లినట్లు రిటర్నింగ్ అధికారి లావణ్య తెలిపారు. మొదటి రోజు శుక్రవారం ఒక్క నామినేషన్ కూడా రాలేదని రిటర్నింగ్ అధికారి చెప్పారు.


రిటర్నింగ్ కార్యాలయం వద్ద పోలీసుల బందోబస్తు

చార్మినార్, నవంబర్ 3 : శాసనసభ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం నుంచి ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు తమ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసుకోవడానికి రిటర్నింగ్ అధికారికి తమ దరఖాస్తులను అందిచాల్సి ఉంటుంది. పాతనగరంలోని బహదూర్‌పుర, చార్మినార్ నియోజకవర్గాల పరిధిలో మాత్రం మొదటి రోజైన శుక్రవారం ఒక్క నామినేషన్ దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారులు తెలిపారు. చార్మి నార్ నియోజకవర్గం నుంచి వివిధ పార్టీల అభ్యర్థులు 19 నామినేషన్ పత్రాలు తీసుకెళ్లారని రిటర్నింగ్ వెంకన్న తెలిపారు. బహదూర్‌పుర నియోజకవర్గం నుంచి 3 నామినేషన్ పత్రాలను తీసుకెళ్లారని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.


కుస్తీపోటీల్లో గెలుపొందిన గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ కుర్వ వీరేష్‌ను శుక్రవారం ఇన్‌స్పెక్టర్ సయ్యద్ ముజీబ్ ఉర్ రహమాన్ పోలీస్ స్టేషన్‌లో అభినందించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల శాంతిభద్రతల కోసం విధులు నిర్వహిస్తూ క్రీడా పోటీల్లో రాణించడం చాలా గొప్ప విషయం అని అన్నారు. - మెహిదీపట్నం, నవంబర్ 3

## మరమ్మతుల కారణంగా..

మెహిదీపట్నం, నవంబర్ 3 : విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ సబ్‌డివిజన్ పరిధిలోని 11 కేవీ హుమాయూన్‌నగర్ ఫీడర్ హుమాయూన్‌నగర్, మెహిదీపట్నం, ఎంఐజీహెచ్, శ్రీరాం నగర్, మురాద్‌నగర్,11 కేవీ లంగర్ హౌస్ ఓవర్‌హెడ్ ఫీడర్ రాజీవ్ గాంధీ నగర్, డిఫెన్స్ కాలనీ, బాపూనగర్, మెహిదీ కాలనీ, జితేందర్ ఫ్లోర్‌మిల్,11 కేవీ లంగర్‌హౌస్ కేబుల్ ఫీడర్ లంగర్‌హౌస్, రింగ్ రోడ్, వినాయక నగర్, హరిదాస్ పుర, అలంకార్ థియేటర్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 : 30 వరకు,11 కేవీ మిని ఓయూ కాలనీ ఫీడర్ మినీ ఓయూ కాలనీ, గ్యాస్ గోడౌన్,11 కేవీ బృందావన్ కాలనీ ఫీడర్ కోహెసర్ కాలనీ, మినీ బృందావన్ కాలనీ, విరాట్‌నగర్, హకీంపేట్ కుంట, హకీంషా,11 కేవీ హకీంషా ఫీడర్ హకీంషా కుంట, బృందావన్ కాలనీ, ఛోటా జానకీ నగర్, బడా జానకీనగర్, డీలక్స్ కాలనీ, పారామౌంట్ కాలనీ గేట్ -1 ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ ఓ ప్రకటనలో తెలిపారు.

## కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం రద్దు చేయాలి




కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం న్యూ ఢిల్లీ రాంలీల మైదానంలో అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన టీఎన్జీవో కేంద్ర సంఘం కార్యదర్శి మారం జగదీశ్వర్, ఉపాధ్యక్షులు కస్తూరి వెంకట్, సభ్యులు పర్వతాలు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, హైదరాబాద్ జిల్లా శాఖ ఉపాధ్యక్షులు కురాడి శ్రీనివాస్, సభ్యులు మహమ్మద్ అబ్దుల్ ముజీబ్, బొలిగిద్ద శంకర్ తో కలిసి పాల్గొన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దు చేసేందుకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రత్యేక కమిటీని వేయాలని ఈ సందర్భంగా కోరారు. - సుల్తాన్‌బజార్, నవంబర్ 3

## ఫ్లాగ్‌మార్చ్..



రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భాగంగా అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ మార్చ్‌ను సుల్తాన్‌బజార్ డివిజన్ ఏసీపీ ఎ. చిన్న బాలగంగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ సంతోషం, ఈగల్ టీంలతో కలిసి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటిస్తూ పోలీసులకు సహకరించాలన్నారు. రాజకీయ నాయకులు ప్రచారాలు, సభలు నిర్వహించాలన్నా పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరు ప్రయత్నించినా ఉపేక్షించేది లేదని అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.- సుల్తాన్‌బజార్, నవంబర్ 3

## అభివృద్ధిని చూసి ఓటు వేయండి



బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కార్వాన్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. శుక్రవారం వీర్ శివ్ కక్కయ్య సమాజ్ ( డోర్ సమాజ్ ) ప్రతినిధులతో కలసి సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో కారు గుర్తు ఓటు వేసి తనను గెలిపించాలని సంఘం ప్రతినిధులను కోరారు. సంఘం ప్రతినిధులు బాల్‌రాజ్ హోట్కర్, తులసీ దాస్ ఎమ్మెల్యే అభ్యర్థి మిత్రకృష్ణను సన్మానించారు. కార్యక్రమంలో డోర్ సమాజ్ ప్రతినిధులు పాల్గొన్నారు. - జియాగూడ, నవంబర్ 3

## నాంపల్లి ఎంఐఎం అభ్యర్థి మాజిద్‌హుస్సేన్



మెహిదీపట్నం, నవంబర్ 3 : నాంపల్లి ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థిగా నగర మాజీ మేయర్, మెహిదీపట్నం కార్పొరేటర్ మహ్మద్ మాజిద్‌హుస్సేన్‌ను శుక్రవారం పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రకటించారు. మాజిద్ హుస్సేన్ 2011లో అహ్మద్‌నగర్ కార్పొరేటర్‌గా గెలిచి నగర మేయర్‌గా పనిచేశారు. ఈ నేపథ్యంలో ఇక్కడి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్‌ను యాకుత్‌పురకు పంపి .. మాజిద్ హుస్సేన్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారు.



నాంపల్లిలో విజయాన్ని సాధించడం ఖాయమని ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థి మహ్మద్ మాజిద్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ తన పేరును ప్రకటించడం తన జీవితంలో మరచిపోలేని రోజు అని అన్నారు. దారుస్సలాం నుంచి ఆగాపురా వరకు ర్యాలీగా వెళ్లి సాలార్ సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ సమాధి వద్ద నివాళులర్పించిన ఆయన నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు ముస్తాక్, జాఫర్‌ఖాన్, ఎండీ.మూసా, డాక్టర్ షేక్ ఖాసీం, సర్ఫరాజ్ సిద్ధిఖీ, ఆరిఫ్ రిజ్వాన్ పాల్గొన్నారు. - మెహిదీపట్నం, నవంబర్ 3



మెహిదీపట్నం, నవంబర్ 3 : కార్వాన్ ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్‌ను ప్రకటిస్తూ శుక్రవారం పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రకటించారు. 1986లో నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్ ప్రాంత ఏరియా ప్రెసిడెంట్‌గా విధులు నిర్వహించిన ఆయన అందరికీ అందుబాటులో ఉండేవారు. ఈయన భార్య నజ్మా కౌసర్ టోలిచౌకి, నానల్‌నగర్ కార్పొరేటర్‌గా పనిచేశారు. 2014లో కార్వాన్ నుంచి కౌసర్‌మొహినుద్దీన్‌కు ఎమ్మెల్యేగా పార్టీ అవకాశం ఇచ్చింది. అప్పటి నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

## మరోసారి గెలిచి తీరుతా



ప్రజల అభివృద్ధికి కృషి చేశామని ఎన్నికల్లో ఈ సారి ఘన విజయం సాధిస్తానని కార్వాన్ ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థి కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ తన పేరును ప్రకటించినందుకు ఆయనకు రుణపడి ఉంటానన్నారు. శుక్రవారం కౌసర్ మొహినుద్దీన్ పేరును ప్రకటించగానే కార్వాన్ నుంచి లంగర్‌హౌస్, గోల్కొండ, టోలిచౌకి, నానల్‌నగర్‌ల మీదుగా పర్యటించారు. లంగర్‌హౌస్‌లో కౌసర్‌మొహినుద్దీన్ పలువురు అభినందించి సన్మానించారు. - మెహిదీపట్నం, నవంబర్ 3